


GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

ఖమ్మం-భద్రాద్రి సూర్యాపేట

శనివారం 05, జులై, 2025

పేజీలు 4

# టి మీడియా ఎఫెక్ట్

## ఫుడ్ సేఫ్టీ టాస్కోఫోర్స్ దాడులు తయారీ కేంద్రాల సీజ్





**టి మీడియా, జూలై 4 ఖమ్మంబ్యూరో :**

శుక్రవారం ఖమ్మం నగరంలోని పలు రెస్టారెంట్లు, వివిధ రకముల మసాలా దినుసులు (స్పైసెస్), పచ్చళ్ల తయారీ, స్వీట్స్ తయారీ కేంద్రాలపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్కోఫోర్స్ బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ విభాగం ఉన్నతాధికారులు, ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి. శివలీల ల ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి, పి. స్వాతి, శ్రీషిక, సిహెచ్. లోకేష్, శరత్ లతో కూడిన బృందం


టీ-మీడియా

కలర్ (పుల్లు) బేకరీలు

ఖమ్మం పట్టణంలోని వైరా రోడ్ లో గల పి ఎస్ కే ఫుడ్స్ అండ్ స్పైసెస్, ఎన్టీఆర్ సర్కిల్ లో గల జీ.పి. రెడ్డి ఘీ స్వీట్ షాప్, ఐస్ క్రీమ్ యూనిట్, పాలమూరు గ్రిల్స్ రెస్టారెంట్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాలమూరు గ్రిల్స్ రెస్టారెంట్ నందు వంట గది అపరిశుభ్రంగా ఉండడం, రిఫ్రిజిరేటర్, కోల్డ్ ఛాంబర్ లలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను మెయిన్ టైన్ చేయకపోవడం, సుమారు 2 వేల రూపాయల విలువ కలిగిన 8 లీటర్ల కాలం చెల్లిన ఫ్రూట్ క్రషెస్, సుమారు 19 వేల రూపాయల విలువ



మిగతా 4లో...

## ఇన్ఫోసిస్‌కు యస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక

**టీ మీడియా, జులై 4, ఖమ్మం:**

ప్రముఖ సాఫ్ట్ వేర్ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్ కు తమ కళాశాలకు చెందిన 5గురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ ఫూల్ డ్రైవ్ లో తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభను కనబరచారని, జిల్లాలోని అత్యధికంగా 5గురు ఎంపికవ్వడం తమకు గర్వకారణమని కృష్ణ తెలిపారు. గురువారం ఎంపిక పత్రాలను అందుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ అటానమస్ హోదాను సాధించిన అనంతరం తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగామని వారు తెలిపారు. వివిధ దశలలో నిర్వహించిన ఎంపికల పరీక్షలలో మొదట ఆన్లైన్ టెస్ట్లో 9 మంది ఎంపిక అవ్వగా, చివరి హెచ్. ఆర్. రౌండ్లో 5 గురు అర్హత సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 6 నెలల పాటు శిక్షణలో భాగంగా 3.60 లక్షల రూపాయలు



అందుకుంటారని, తదనంతరం 9 లక్షల పై చిలుకు వార్షిక ఆధాయం పొందుతారని వారు తెలిపారు. 50కు పైగా అభివృద్ధి చెందిన దేశాలలో విస్తరించిన సాఫ్ట్వేర్ సంస్థ ఇన్ఫోసిస్ లో తమ కళాశాల విద్యార్థినులు సిస్టమ్ ఇంజనీర్ గా ఎంపిక అవ్వడం తమ కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి సహకారంతో నిర్వహించిన ఎంపికలలో జిల్లాలోనే అగ్రగామిగా నిలవడం పై టాస్క్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. తదనంతర కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు, డాఎం యన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ



**టి మీడియా, జూలై 4, భద్రాచలం:** జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అంబేద్కర్ సెంటర్లో అమరవీరుల స్థూపాల వద్ద జరిగిన ప్రారంభ కార్యక్రమంలో సిఐటియు భద్రాచల పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కార్డులను రద్దు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ ఈనెల తొమ్మిదవ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహించాలని కార్మిక ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయని అన్నారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఉద్యోగులు మరియు కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో ఉన్న కూటమి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని తీసుకువచ్చిందని, బిజెపి దాని మిత్రపక్ష పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాలలో వీటి అమలు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ సమ్మెలో వ్యవసాయ కార్మికులు రైతులు దేశంలో ఉన్న సమస్త రంగాల ప్రజలు పాల్గొంటున్నారని అన్నారు. కాబట్టి ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఇప్పటికే విస్తృతమైన ప్రచారం జరుగుతోందని, జూలై 9 వ తేదీన పెద్ద ర్యాలీ జరుగుతుందని,ఆ ర్యాలీలో కార్మికులు మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు ఉపాధ్యక్షులు, ఎం బి నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గడ్డం స్వామి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పోరాటాలు ఆందోళనల ద్వారానే ఇటువంటి కార్మిక, ఉద్యోగ వ్యతిరేక నిర్ణయాలను తిప్పి కొట్టి, కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, పట్టణ అనుబంధ సంఘాల నాయకులు వై వి రామారావు, కొలగాని రమేష్, నకిరికంటి నాగరాజు, అజయ్ కుమార్, అప్పారి రాము, నరసింహాచారి, గుమ్మడి నాగరాజు, భూపేందర్, సతీష్, ఎస్ జాకీర్ హుస్సేన్, ముత్తయ్య, రామరాజు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు నిర్మించుకున్న గిరిజనులు

- రూ.2.50 లక్షలు సేకరించి, శ్రమదానం



**టి మీడియా, జూలై 4,ములుగుబ్బురో :** ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఆ గిరిజన సోదరులు నిరీక్షించలేదు. చిన్న వర్షానికి ఉప్పొంగి రవాణాకు ఆటంకంగా ఉన్న వాగుపై కల్వర్టును నిర్మించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఈ సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలం ముత్తారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే ఆలుబాక నుంచి ముత్తారం వెళ్లే అంతర్గత రోడ్డులో ఓటికుంట వాగు ఉంది. అది చిన్నపాటి వర్షానికే ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం వచ్చినా, నిత్యావసరాలు కావాలన్నా, చదువుకోవాలన్నా వెంకటాపురం-భద్రాచలం ప్రధాన మార్గంలోని ఆలుబాక, వెంకటాపురం రావాల్సిందే. మారుమూల అటవీ ప్రాంతం కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపు కూడా అంతంత మాత్రమే. దీంతో ఈ గ్రామంలో ఉంటున్న 124 కుటుంబాలు కలిసి కల్వర్టు నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నాయి. కుటుంబానికి రూ.4 వేల నుంచి రూ.5 వేలు చొప్పున సుమారు రూ.2.50 లక్షలు సేకరించి ఆరు సిమెంటు పైపులు కొనుగోలు చేశారు. అందరూ కలిసి రెండ్రోజుల్లో కల్వర్టును నిర్మించేశారు. తమ చేతుల్తో కట్టుకున్న కల్వర్టును చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారీ ఆదివాసీలు.



## వరద ముంపు బాధిత ప్రాంతాల పరిశీలన

- అప్రమత్తంగా ఉండాలి
- తహశీల్దార్ సునీతా ఎలిజబెత్

**టీ మీడియా,జులై 4, ముదిగొండ :** ముదిగొండ మండల పరిధిలోని మున్నేరు ముంపు ప్రాంతాలైన పండ్రేగుపల్లి గ్రామంలో వరద పరిస్థితిని కరకట్ట నుంచి పరిశీలించారు అనంతరం వరద ప్రభావిత ప్రాంతాలలో పారిశుధ్య పనులు ఓవర్ హెడ్ ట్యాంక్స్ శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం, వీధులను శుభ్రపరచి బ్లీచింగ్ వేయడం, మురుగు కాలువల్లో పూడిక తీత, చెత్త కుప్పల తొలగింపు ప్రక్రియను శరవేగంగా చేయాలని వీలైనంత త్వరగా పారిశుద్ధ్య సంబంధిత పనులు పూర్తి చేయాలని గ్రామ పంచాయితీ సెక్రటరీకి వివరించారు సీజనల్ వ్యాధుల నివారణ చర్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తున్నామని ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సునీతా తెలిపారు వారి వెంట రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వహీదా సుల్తానా,ప్రసన్న కుమార్ ఉన్నారు.



## కాంగ్రెస్ సభకు భారీగా తరలిన పార్టీ శ్రేణులు

**టి మీడియా, జులై 4, పినపాక ప్రతినిధి:** హైదరాబాదు కాంగ్రెస్ , బహిరంగ సభకు పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య నేతృత్వంలో 24 గ్రామ పంచాయతీల నుండి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య,పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరు కానున్న సభలో జై భీమ్ జై బాపూ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు,గాదె ప్రతాపరెడ్డి, బట్టా సత్యనారాయణ, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, బరాసు సంపత్, మచ్చా నరసింహారావు,ఎస్కే మోసిన్,మల్లెం కరుణ్,గొల్లపల్లి నరేష్ కుమార్,ధరావత్ హర్ష,వేముల విజయ్,కందుల లక్ష్మణ్, భూతం వెంకన్న, చింత రవి, కోండ్రు నాగేశ్వర రావు, రావులపల్లి నరసింహారావు, కమ్మాల వెంకన్న, కమ్మాల పుల్లయ్య, కమ్మాల వెంకన్న 2, సోడే వెంకటేశ్వర్లు, గుడ్ల వెంకన్న, కాళిదాసు,లక్ష్మణ్ చారి,సబ్జా పిచ్చయ్య, కంట్లమయ్య గౌడ్, పర్సిక తిరుపతయ్య, కలేటి రామకృష్ణ, యన్నా సంగీతరావు, వల్లేపోగు బాబు, ఊకె వెంకటేశ్వర్లు తాళ్లూరి సత్యనారాయణ, బొల్లం ఐలయ్య, కోలా శశికాంత్, బేతం నరసింహారావు, చాపా వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

## సింగరేణి ఆధ్వర్యంలో రోశయ్య జయంతి



**టి మీడియా, జులై 04, పినపాక ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య 92వ జయంతిని శుక్రవారం మణుగూరు సింగరేణి అధికారులు ఘనంగా నిర్వహించారు, జి ఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమ ంలో జి ఎం దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక మంత్రిగా 16 సార్లు బడ్జెట్ సమర్పించారని, ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణానంతరం ముఖ్యమంత్రిగా కొనసాగారని, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా రోశయ్య అందించిన సేవలు అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం శ్రీనివాస చారి, ఏరియా ఇంజనీర్ శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రమేష్, ఏజీఎం ఐ ఈ రాంబాబు, ఏ ఎస్ ఓ వెంకట రామారావు, ఏరియా సర్వే అధికారి దయాకర్, డీజీఎం ఎస్ఎంఎస్ నరసింహస్వామి, పర్సనల్ మేనేజర్ తిరుపతి,గుర్తింపు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సభకు భారీగా పార్టీ శ్రేణులు



**టీ మీడియా,జులై 4, ముదిగొండ :** హైదరాబాదు కాంగ్రెస్ సభకు ముదిగొండ మండల మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేందర్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ బాబు నేతృత్వంలో అన్ని గ్రామ పంచాయతీల నుండి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరారు. టీ పీ సీ సీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరు కానున్న సభలో జై భీమ్ జై బాపూ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జర్నలిస్టును పరామర్శించిన నాయకులు



**టీ మీడియా,జులై 4,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి మండల ప్రజాజ్యోతి విలేకరి తేళ్ల శ్రీనివాస్ ను టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల తేళ్ల శ్రీనివాస్ తండ్రి తేళ్ల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు గేటుకారేపల్లికి వెళ్ళి మృతుడు తేళ్ల వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. కుమారుడు తేళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, వేగినాటి మాధవరావు, షేక్ జానీపాషా, రవికిరణ్, అజ్మీర వీరన్న, భూక్య రాంకిషోర్, అదేర్ల నాగరాజు, భయ్యా నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## బదిలీ అయిన డీసీసీబీ అధికారులకు వీడ్కోలు

- ఖాతాదారుల అభిమానం సంతృప్తినిస్తుంది



**టీ మీడియా,జులై 4,సింగరేణి(కారేపల్లి) :** డీసీసీబీ కారేపల్లి లో పని చేసి బదిలీ అయిన అధికారులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డీసీసీబీ కారేపల్లి బ్రాంచీలో అసిస్టెంట్ మేనేజర్ గోపతి పద్మావతి, క్యాషియర్ ఆలేటి గాయత్రి లు ఖమ్మంలోని బ్రాంచీలకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా కారేపల్లి బ్రాంచీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మేనేజర్ బాల రవికుమార్ మాట్లాడుతూ డీసీసీబీలో రైతులకు సేవ చేయటం ఎంతో అనందాన్ని ఇస్తుందన్నారు. వృత్తిలో ఖాతాదారుల అభిమానాన్ని చూరగొనటం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా డీసీసీబీలో వివిధరకాలు రుణాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. సక్రమంగా రుణాలురెన్యూవల్ ద్వారాఅనేకలాభాలు ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ కొంగర వేణు, ఉద్యోగులు అరుణ, సురేష్, వెంకట్రావు, పుచ్చకాయల వంశీ, ఆదెర్ల అంజమ్మ, సొసైటీ సిబ్బంది ఉండం సాంభశివరావు, ముండ్ల సురేష్, దమ్మాలపాటి నాగేశ్వరరావు, యాకూబ్‌పాష, దమ్మలపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన పై అవగాహన



**టీ.మీడియా,జూలై4,చింతూరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష భాస్కర్ ఆదేశాల మేరకు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం పై బూత్ యూనిట్ . సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి బూత్ లోని బూత్ సభ్యులు డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు 50 ఫోటోలు అప్లోడ్ చేసి టెలిగ్రామ్ బాట్ లోని మై టిడిపి యాప్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ఈ నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ పని మన పనికి భావించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని అన్నారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం మండలంలో విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ ఓబిల్లనేని నరసింహారావు, కో క్లస్టర్ పొదిలి రామారావు, నాయకులు మల్లెల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్ లు ముత్యాల శ్రీరామ్ మూర్తి, బూత్ ఇన్చార్జి లు పాల్గొన్నారు



# విజయభేరికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**టీ మీడియా,జులై04, సింగరేణి (కారేపల్లి) :**

హైదరాబాద్ లో శుక్రవారం జరిగిన సామాజిక న్యాయ విజయభేరికి కారేపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్ళారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సారధ్యలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖార్గే ముఖ్యఅతిధిగా హాజరైన సభకు బస్, కారులలో నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్ళిన వారిలో కాంగ్రెస్ నాయకులు తలారి చంద్రప్రకాశ్, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి వీరప్రతాఫ్, మల్లెల నాగేశ్వరరావు, డాక్టర్ పొలగాని శ్రీనివాస్, ఎండీ.యాకూబ్ అలీ, గుగులోత్ భీముడు, కిలారి అప్పారావు, దేగల ఉపేందర్, తాజుద్దీన్, తొగరు శ్రీను, షఫీ, జీ.నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతా రామరాజు జయంతి

**టీ.మీడియా,జూలై4,చింతూరు:**




చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా చరిత్ర విభాగం అధ్వర్యంలో అల్లూరి సీతా రామరాజు జయంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థినీ,విద్యార్థులను ఉద్యేశించి మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ లో ఉన్న విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంకి గ్రామం లో1897 జూలై 4 వ తేదీన క్షత్రియ కుటుంబంలో జన్మించిన అల్లూరి సీతా రామరాజు భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గిరిజన ప్రజల అభివృద్ధికి కృషి చేసి ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యమనే మహాశక్తినీ ఎదురొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతా రామరాజని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ లో భాగంగా ఉన్న విశాఖపట్నం జిల్లాలోని ఆదివాసీ గిరిజన ప్రజల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కొరకు పోరాటం చేసిన గొప్ప మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు అని తెలిపారు.చరిత్ర విభాగాధిపతి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లూరి సీతా రామరాజు అతి చిన్న వయసులోనే బ్రిటిష్ వారి తో పోరాడటానికి సిద్ధపడి తన ప్రాణాలను బలిదానం చేసిన సమరయోధుడని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్.వై.పద్మ,యస్ .అప్పనమ్మ ,కె.శకుంతల,జి.హారతి,కె.శైలజ యం.రామ్ మోహన్ రావు , జి.సాయి కుమార్, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు



# అల్లూరి సీతా రామరాజు జయంతి

**టి.మీడియా,జూలై4,చింతూరు:**

అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా స్థానిక ఎడిషనల్ ఎస్పీ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ లో ఉన్న విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంకి గ్రామం లో1897 జూలై 4 వ తేదీన క్షత్రియ కుటుంబంలో జన్మించిన అల్లూరి సీతా రామరాజు భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గిరిజన ప్రజల అభివృద్ధికి కృషి చేసి ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యమనే మహాశక్తినీ ఎదురొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతా రామరాజని తెలిపారు. సీఐ తెల్లం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ లో భాగంగా ఉన్న విశాఖపట్నం జిల్లాలోని ఆదివాసీ గిరిజన ప్రజల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కొరకు పోరాటం చేసిన గొప్ప మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు అని తెలిపారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ తూర్పుగోదావరి, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో చురుకుగా పాల్గొని బ్రిటిష్ వారిని గడగడ లాడించారని పేర్కొన్నారు. అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టులే

- **భాగం హేమంతరావు**

**టీ మీడియా జులై 4 తిరుమలాయపాలెం :**

తిరుమలాయపాలెం కొక్కిరేణి గ్రామంలో చావ వెంకటేశ్వరరావు 11 వ వర్ధంతి సభలో భాగం హేమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సాయుధ తెలంగాణ పోరాటంలో నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులంతా ఏకమై పేద ప్రజల పక్షాన పోరాడింది కమ్యూనిస్టులే అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన స్వర్గీయ కామ్రేడ్ చావా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సాయిధ తెలంగాణ పోరాటంలో నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడింది చావా వెంకటేశ్వరావు అని అన్నారు. దొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడి భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి దొరల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూ ములను పేద ప్రజలకు పంచిన ఘనత చావా వెంకటేశ్వరరావు కి ఉందని తెలియజేశారు. కొక్కిరేణి గ్రామం తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సిపిఐ పార్టీ ఎదుగుదలకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ



కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండి సురేష్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు డిసిసిబి డైరెక్టర్ సొసైటీ చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ,సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, సహ కార్యదర్శి చీమ రామకృష్ణ, మండల నాయకులు చావా వెంకట్రావు, మల్లేపల్లి జనార్ధన్, మధు,బీఆర్ఎస్ నాయకులు గడ్డం వీరభద్రం, గంట కృష్ణ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

- **ఆదివాసి గిరిజనులతో సీఐ**

**టి మీడియా, జులై 4, పినపాక ప్రతినిధి:**

ఆదివాసి గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని ఏడూళ్ళ బయ్యారం సర్కిల్ ఇన్స్ పెక్టర్ వెంకటేశ్వరావు తెలిపారు. పినపాక మండల పరిధిలోని వలస ఆదివాసి గ్రామం చింతలపాడును ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. కమ్యూనిటీ కాంటాక్ట్, ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి అయన వారికీ వివరించారు. ముఖ్యంగా వలస ఆదివాసి సమూహాలు సంఘటితంగా ఉంటే అసాంఘిక శక్తుల్ని అడ్డుకోవచ్చు అని తెలిపారు . అసాంఘిక శక్తులకు దూరంగా ఉంటూ అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళొచ్చని ఆయన సూచించారు.వలస ఆదివాసీ గ్రామాల ప్రజలకు విద్య వైద్యం,ఉపాధి, రవాణా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం, పోలీస్ శాఖ కృషి చేస్తుందని,ఆయా గ్రామాల్లో సమస్యలు పోలీస్ శాఖ దృష్టి కి తీసుకువచ్చినట్లైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వానాకాలం సీజన్ కావడంతో అసాంఘిక శక్తులు ఆశ్రయం కోసం గ్రామాల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్నేరులో పడి అన్నదమ్ములు మృతి

**టి మీడియా, జూలై 4 ,చింతకాని :**




ప్రమాదవశాత్తు మున్నేరులో పడి అన్నదమ్ములిద్దరూ మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్న మండవ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండవ గ్రామానికి చెందిన కాసిమల్ల చిన్న వెంకటికి ముగ్గురు కుమారులు. వీరిలో బీటెక్ చదువుతున్న పెద్ద కుమారుడు నాగ గోపి ( 23), డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదవబోతున్న చిన్న కుమారుడు నందకిశోర్ (19) గ్రామ సమీపంలో గల మున్నేరులో మిత్రులతో కలిసి బైక్‌ను శుభ్రం చేసేందుకు దిగారు. వాహనాన్ని శుభ్రం చేసిన అనంతరం నందకిశోర్ కొంచెం లోపలికి కాళ్లు కడుక్కునేందుకు వెళ్లాడు. అక్కడ మున్నేరు లోతుగా ఉండటంతో పాటు వరద ఉధృతంగా వస్తుండడంతో నందకిశోర్ పట్టుతప్పి ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. తమ్ముడిని రక్షించేందుకు అన్న నాగ గోపి ప్రయత్నించి తాను మున్నేటి నీటిలో మునిగిపోయాడు. వారిని రక్షించేందుకు మిత్రుడు కూడా మున్నేరులో పడిపోయాడు.అక్కడే చేపల వేట కోసం వచ్చిన వారు ఒకరిని రక్షించగా అన్నదమ్ములిద్దరూ మున్నేరు వరద తాకిడికి కొట్టుకుపోయి మునిగిపోయారు. ఈ విషయాన్ని స్థానికులకు సమాచారం అందించారు. చింతకాని తాసీల్దార్ కరుణాకర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికులు మున్నేరులో మునిగిపోయిన అన్నదమ్ముల మృతదేహాలను కొంత దూరంలో గుర్తించారు. వారి మృదేహాలను ప్రొక్లైన్ యంత్రంతో మున్నేరు నుంచి వెలికితీసి ఒడ్డుకు చేర్చారు. కొడుకులిద్దరి మృతదేహాలను చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదచాయలు అలుముకున్నాయి. చింతకాని ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి కేసు నమోదు చేశారు.



# సానబోయిన శ్రీనివాస్ గౌడ్ మృతి

- **మాజీ ఎంపీ నామ సంతాపం**

**టీ మీడియా, జులై 4, ఖమ్మం:**



తెలుగుదేశం పార్టీ రూరల్ మండల కన్వీనర్ సానబోయిన శ్రీనివాస్ గౌడ్ అకాల మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటకు చెందిన శ్రీనివాస్ గౌడ్ గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిన వెంటనే నామ వారి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి ఈ విషాద సమయంలో ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శ్రీనివాస్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని నామ ప్రార్థించారు. లిపలువురు నివాళి :లి బిఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, కూసుమంచి మండల నాయకులు మాల్లీడి వెంకన్న, నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు వాకదాని కోటేశ్వరరావు, సంజీవ రెడ్డి, నామ వ్యక్తిగత కార్యదర్శి జి నాగరాజు, స్థానిక నాయకులు నారపాటి రమేష్, అట్లూరి వీరబాబు, వెంపటి ఉపేందర్, గనపారపు శ్రీను, గోనె నాగిరెడ్డి, పల్లెబోయిన వెంకటేశ్వర్లు, దాట్ల ప్రసాద్, మామిళ్ళ సాంబి రెడ్డి తదితరులు ఖమ్మం రూరల్ మండలం, నాయుడుపేట గ్రామం వెళ్లి సానబోయిన శ్రీనివాస్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అంతిమ యాత్రలో పెద్ద ఎత్తున శ్రీనివాస్ బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు.

# టీ మీడియా ఎఫెక్ట్

(మొదటిపేజీ తరువాయి..)

గల 40 కిలోల కాజు, షాజీరా, నూడిల్స్, ఇతర ముడి సరుకులపై లేబుల్ డిఫెక్ట్స్ కలిగి ఉండడం, అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచిన కూరగాయలను గుర్తించి, హోటల్ యాజమాన్యం పై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ, అప్పటికప్పుడే ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకూడదని వాటిని ధ్వంసం చేసి ఎఫ్.ఎస్.ఎస్ చట్టాన్ని ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేయడం జరిగింది. అలాగే వైరా రోడ్ లో గల పివిస్కే ఫుడ్స్ అండ్ స్పైసెస్ లో విస్తృత తనిఖీలు చేయగా, ఫుడ్ హ్యాండ్లర్స్ ఎటువంటి పరిశుభ్రత ప్రమాణాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, తయారీ కేంద్రంలో తగిన లైటింగ్, వెంటిలేషన్ లేకపోవడం, ప్లాస్టిక్ డ్రమ్ములలో పచ్చళ్లను నిల్వ ఉంచడం, ముడి సరుకులు నిల్వ ఉంచడానికి సరైన స్టోరేజ్ సదుపాయాలు లేకపోవడం, ఆహార పదార్థాలు, ముడి సరుకులపై ఈగలు ఉండడం గుర్తించి లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన రెడీ టు ఈట్ సేవరిస్, మినప్పప్పు, రాక్ సాల్ట్ , బెల్లం, నూనె, నెయ్యి, మొదలగు పదార్థాలను గుర్తించి యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేసిన టాస్క్ ఫోర్స్ హెడ్ వీ జ్యోతిర్మయి బృందం వాటిని సీజ్ చేసినట్లు, అనుమానిత శాంపిళ్లను పరీక్ష నిమిత్తం హైదరాబాదులో గల ల్యాబ్ కు పంపించడం జరుగుతుందని టాస్క్ ఫోర్స్ హెడ్ తెలిపారు.ఎఫ్.ఎస్.ఎస్. చట్టం 2006 ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేశారు.వైరా రోడ్ లో గల ఐబాకో ఐస్ క్రీమ్ యూనిట్లో సరైన పేరుతో లైసెన్స్ లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ క్రీములు, చాక్లెట్లు నిల్వ ఉంచడం, తయారీ, ఎక్స్పైరీ డేట్ లను వినియోగదారులకు సరైన విధములో డిస్ ప్లే చేయకపోవడం, అపరిశుభ్ర వాతావరణంలో రిఫ్రిజిరేటర్లలో చాక్లెట్లు ఇతర పదార్థాలను నిల్వ ఉంచడం, సరైన పెస్ట్ కంట్రోల్ పద్ధతులను పాటించకపోవడంతో యాజమాన్యానికి నోటీసులు అందించడం జరిగిందఎన్టీఆర్ సర్కిల్ లో గల జిపి రెడ్డి ఫీ స్వీట్స్ లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో కేక్స్ తయారు చేయడం, కేక్స్, ఇతర స్వీట్స్ తయారీలో హానికర రసాయనాలు కలిగినటువంటి రంగులు కలపడం, ప్లాస్టిక్ బకెట్లలో క్రీమును నిల్వ ఉంచడం, ఈగలతో కూడినటువంటి కేకు ను నిల్వ ఉంచడం, 20 వేల రూపాయల విలువగల ఐదు కిలోల కాలం చెల్లిన చెర్రీస్, ఫ్రూట్ క్రషెస్, గుర్తించి వాటిని ప్రజారోగ్యం నిమిత్తం అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగింది. లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన సుమారు 30 వేల రూపాయల విలువ గల 15 కిలోల కన్ఫెక్షనరీ పదార్థాలు, డ్రై ఫ్రూట్స్, మిస్సలేనియస్ పదార్థాలను సీజ్ చేయడం జరిగింది.ఈ రకమైన ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆహార తయారీదారులు, ఆహారం అమ్మేవారు ఆహార పరిరక్షణ ప్రమాణాలను పాటించి, ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఆహారాన్ని ప్రజలకు విక్రయించాలని హెచ్చరిస్తూ లేనియెడల చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ, అవసరమైతే సంబంధిత శాఖ సహాయంతో సీజ్ కూడా చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఆహారాన్ని తయారుచేసి, నిలువ చేసి, రవాణా చేసి ప్రజలకు అమ్మే వ్యాపారస్తులు కల్తీల పట్ల అవగాహన పెంచుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన శుచి, శుభ్రత గల ఆహార పదార్థాలను, ఆహార వ్యాపారులు సరైన బాధ్యతతో వ్యవహరించాలని, సురక్షితమైన కల్తీ లేని ఆహారాన్ని ప్రజలకు అందించవలసిందిగా వ్యాపారస్తులను టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వంకాయలపాటి జ్యోతిర్మయి సూచించారు. ఈ నిబంధనలు పాటించని యెడల చట్ట ప్రకారం శిక్షకు గురి కాబడతారని హెచ్చరించడం జరిగింది.ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొనడం జరిగింది.



## ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు

**టీ మీడియా ,జూలై 4 ,కొణిజర్ల:**

తెలంగాణ తొలిదశ ఉద్యమానికి నాంది పలికిన పోరాట యోధుడు అమరజీవి దొడ్డి కొమురయ్య అని గొర్రెల మేకల పెంపకదారుల సంఘం (జిఎమ్పిఎస్) వైరా డివిజన్ అధ్యక్షులు కంపసాటి శివ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో,చిన్నమునగాల గ్రామంలో అమరజీవి దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రామచంద్రారెడ్డి, జానకమ్మ దొరసాని ఆగడాలతో రైతులపై చేస్తున్న దోపిడీనీ దొడ్డి కొమరయ్య ఎదిరించి వడిసెలు, బల్లేలు చేతబట్టి భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో భాగంగా దొరలు,గూండాల కాల్పుల్లో వీర మరణం పొందిన మహా యోధుడు నేటి తరానికి ఆదర్శం అని తెలిపి, అంత గొప్ప మహనీయుడైన దొడ్డి కొమరయ్య చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని,ఆయన వర్ధంతి వేడుకలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక యాదవ సంఘం నాయకులు గమిడి నరేష్,కంపసాటి కృష్ణయ్య,కంపసటి గోవిందు,కంపసాటి సత్యనారాయణ, గమిడి బాలకృష్ణ,పగడాల వెంకయ్య, పగడాల బాలకృష్ణ, పగడాల పరశురాం,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సభకుపార్టీ శ్రేణులు

**టీ మీడియా, జులై 4, తిరుమలాయపాలెం:**



మండలం నుండి పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు మేరకు శుక్రవారం తిరుమలాయపాలెం మండలం నుండి ఎల్ బి స్టేడియంలో జరిగే గ్రామశాఖ అధ్యక్షులు నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ శ్రేణులతో బహిరంగ సభకు ముఖ్య అతిధిగా విచ్చేయుచున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొంటున్న సందర్భంగా శుక్రవారం పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ పిలుపుమేరకు తిరుమలపాలెం మండల నుండి కదిలిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉన్నం రాజశేఖర్ తాటికొండ కిరణ్ పొట్ల కిరణ్ మాజీ ఎంపిటిసి గొల్ల లింగయ్య పి నాగేశ్వరరావు పోలేపొంగు భాస్కర్ షేక్ సపుద్దీన్ రమేష్ వెంకటేశ్వర్లు దొడ్డ గురవయ్య చామకూరి శ్రీనివాస్ కోటి చిమ్లా నాయక్ కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

## విజయ కళాశాలలో ఏఐఅండ్‌జన్ ఏఐ మాస్టరీ కోర్స్ ప్రారంభం

**టీ మీడియా, జూలై 4 ,కొణిజర్ల :**



విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీని అందించాలనే లక్ష్యంతో విజయ ఇంజనీరింగ్ కాలేజీ నూతనంగా ఏ ఐ అండ్ జన్ ఏ ఐ మాస్టరీ కోర్స్ ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ కవిత పారుపల్లి ఎర్ర వైస్ చైర్ పర్సన్ పి విజయలక్ష్మి మైస్పార్క్ అకాడమీ మరియు స్పీడ్ లాబ్స్ సహాకారంతో ప్రారంభించారు.ఈ సందర్భంగా కవిత పారుపల్లి మాట్లాడుతూ ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,జనరేటివ్ ఏఐ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్, మెషిన్ లెర్నింగ్ వంటి అంశాలపై ప్రాక్టికల్ పరిజ్ఞానం అందించబడుతుంది. ఉద్యోగ భవిష్యత్తును పటిష్టంగా తీర్చిదిద్దేల ఈ కోర్సును రూపొందించారు. ఈ కోర్సు సాధారణంగా నేర్పించబడే కోర్సు కాదు - ఇది విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ కు పురోగమించే వేదిక. అని ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీ కవిత పారుపల్లి ఎర్ర పేర్కొన్నారు.

కోర్సు ముఖ్యాంశాలు

ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం. ప్రస్తుత పరిశ్రమలకు అవసరమైన టూల్స్ అండ్ ఫ్రేమ్ వర్క్స్. జనరేటివ్ ఏఐపై వర్క్ షాప్స్.సర్టిఫికేషన్ అండ్ కెరీర్ గైడెన్స్.తెలంగాణ రాష్ట్రంలో ఆధునిక టెక్ విద్యలో విజయ ఇంజినీరింగ్ కాలేజ్ ముందంజలో నిలవాడాన్ని ఈ కోర్సు సూచిస్తుంది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయేషా తరణం, కళాశాల డీన్ డాక్టర్ డి శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఫరీద్ బాబా మరియు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అధ్యాపకేతరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ లస్కర్ మృతి

**టి మీడియా, జూలై 4 ,బోనకల్లు :**

రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ లస్కర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగింది. కలకోట గ్రామానికి చెందిన యంగల అప్పయ్య (50) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లస్కర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కలకోట గ్రామం నుంచి బోనకల్లులో గల ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి తన బైక్‌పై బయల్దేరాడు. రావినూతల గ్రామం వద్ద బర్రె బైక్‌కు తగలడంతో కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన బోనకల్లు సబ్ డివిజన్ డీఈఈ తమ్మరపు వెంకటేశ్వర్లు, ఏఈఈ రాజేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## డంపింగ్ యార్డ్‌గా స్మశాన వాటిక

- అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం

**టి మీడియా, జూలై 4 ,ఎదులాపురం:**



మున్సిపాలిటీ ఖమ్మం రూరల్ మండలం అధికారుల తీరు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏదులాపురం మున్సిపాలిటీ ప్రజలకు స్మశాన వాటిక సమస్య శాపంగా మారింది. ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా 70 వేల జనాభా కలిగిన ఎదులపురం మున్సిపాలిటీ ఏర్పాటు జరిగి నేటి వరకు ఆరు నెలలు కావస్తున్నా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకపోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీల ప్రజలు నిత్యం నానాయాతలు పడుతున్నారు. చివరకు ప్రాణాలు పోయిన తర్వాత సైతం ఆఖరి మజిలీ కార్యక్రమాలు చేసుకునే అవకాశం లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పూర్వపు రూరల్ మండల కేంద్రం ప్రస్తుత ఎదులాపురం మున్సిపాలిటీ హెడ్ క్వార్టర్స్ లో ప్రజల సౌకర్యార్థం పూర్వపు కాలంలో దాతలు స్పందించి మొన్నేటి కాల్వ పక్కన స్మశాన వాటికకు అనుమతి ఇచ్చారు. దీంతో దశాబ్దాలుగా ఆ ప్రాంత ప్రజలు ఆ ప్రాంతంలోనే దహన సంస్కారాలు చేసుకుంటూ సమాధుల నిర్మాణాలు చేశారు. అయితే గత కొద్ది నెలలుగా మున్సిపాలిటీ అధికారులు ఇదే ప్రాంతంలో వివిధ కాలనీల్లో సేకరించిన చెత్తను డంప్ చేస్తుండడంతో అది కాస్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి స్మశాన వాటికలో సమాధులు కనపడకుండా, అసలు స్మశాన వాటికనేదే లేకుండా చేసింది. చెత్తకుప్పలు ఎక్కువ కావడంతో వాటి నుంచి వెలువడుతున్న దుర్వాసన సమీప కాలనీ వాసుల అనారోగ్యాలకు కారణమౌతుంది.

**ప్రత్యేక డంపింగ్ యార్డ్**

గురువారం రాత్రి మున్సిపాలిటీ హెడ్ క్వార్టర్స్ లో ఖమ్మం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఇదే ప్రాంతంలో దహన సంస్కరణలు చేయాల్సి వచ్చింది. అయితే ఆ ప్రాంతం పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఉండడాన్ని చూసిన కాలనీవాసులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మశాన వాటికను డంపింగ్ యార్డ్ గా మార్చి చివరకు ఆఖరి మజిలీ కార్యక్రమాలు చేయకుండా చేస్తున్నారని ఆగ్రహావేషాలు వ్యక్తం చేశారు. దీంతో అప్రమత్తమైన మున్సిపాలిటీ అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయా డివిజన్ల ప్రజలు కోరుతున్నారు.